విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో మాజీ మంత్రి ఈశ్వర్, నాయకులు

ధర్మారం,ఫిబ్రవరి11: మండలంలోని నర్సింహుపల్లిలో భక్తుల విరాళాలతో కోదండ రామాలయం, శివాలయాలను నిర్మించారు. దాదాపు రూ. కోటి వ్యయంతో ఈ రెండు ఆలయాలను పక్కపక్కనే నిర్మించగా వాటిలో మూల విరాట్ విగ్రహాలతో పాటు ఇతర దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 దాకా ఉత్సవాలు కొనసాగనున్నాయి. భక్త జనసందోహం మధ్య గ్రామ ప్రదిక్షణ చేయించిన అనంతరం ఆలయాల ప్రవేశం చేయించారు. ఆదివారం ఉదయం నుంచి పలు పూజలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ ఆలయాలను సందర్శించారు. దేవతా మూర్తుల విగ్రహాల వద్ద కొబ్బరికాయ కొట్టారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణం, స్థాపిత దేవతార్చన, విగ్రహాల జలాధివాసం,క్షీరాధివాసం,నీరాజన, మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కుమ్మరికుంట మల్లయ్య, నంది మేడారం పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మాజీ సర్పంచ్ అడువాల అరుణజ్యోతి,మాజీ ఉప సర్పంచ్ కత్తెర్ల కోమలత, బీఆర్ఎస్ నాయకులు పూస్కూరు జితేందర్ రావు, గుర్రం మోహన్ రెడ్డి,అడువాల రవి, కత్తెర్ల లచ్చయ్య, దీటి శ్రీనివాస్, ఆవుల ఎల్లయ్య, కుమార స్వామి పాల్గొన్నారు.

ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 11: సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ సూచించారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియాలోని సెక్యూరిటీ సిబ్బంది భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. బొగ్గు రవాణా చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. తరచుగా దొంగతనాలు జరిగే స్థలాలను గుర్తించి నిఘా పెంచాలన్నారు. రాత్రి బదిలీల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఏదైనా సమాచారం వచ్చిన వెంటనే పైఅధికారులకు అందజేసి నిఘా పెంచాలని తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీరాజం, యాదగిరి పాల్గొన్నారు.

ఇటుక బట్టీ కార్మికుల మృతిపై వీడని సస్పెన్స్

- ఫుడ్‌పాయిజనా? ఇంకేమైనా కారణమా?
- మూడురోజుల క్రితం 33 మందికి అస్వస్థత
- చికిత్సపొందుతూ ఇద్దరి మృతి..
- గుట్టుచప్పడు కాకుండా ఒకరి మృతదేహం దహనం
- పోస్ట్‌మార్టానికి మరొకరి మృతదేహం
- రిపోర్ట్ వస్తే వివరాలు తెలిసే అవకాశం

వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 11: గౌరెడ్డిపేట ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికుల మృతిపై సస్పెన్స్ వీడడంలేదు. అధికారులు వెళ్లి విచారణ చేసినా వివరాలు తెలియలేదు. విషతుల్యమైన ఆహారం తీసుకోవడమా? మరేదైనా కారణంతోనా అనే విషయాలు తెలియడం లేదు. మరణించిన ఒకరి మృతదేహన్ని గుట్టుచప్పుడు కాకుండా దహనం చేయడం మరింత అనుమానాలకు తావిస్తున్నది. అయితే మరోకరి మృతదేహన్ని పోస్ట్ మార్టం కోసం పంపించగా రిపోర్ట్ వస్తే ఈ ఘటనకు కారణం తెలిసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వివరాలు.. ఒడిశా రాష్ట్రం జలంగీర్ జిల్లాకు చెందిన సుమారు 200 మంది కార్మికులు కొన్నేళ్లుగా పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఇందులో 33 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో బట్టీల యజమాని అధికారులకు తెలియకుండానే పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్ దవాఖానలకు తరలించారు. ఇందులో కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్ బారీషా(54) శుక్రవారం రాత్రే మరణించాడు. అయితే అధికారులకు సమాచారం అందించకుండానే మృతదేహన్ని దహనం చేశారు. శనివారం కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న లలితామాజీ(26) మృతి చెందింది. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మరో మహిళ పరిస్థితి విషమంగా ఉన్నదని, ఆమెను హైదరాబాద్‌కు తరలించామని జిల్లా వైద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు.

కుళ్లిన వన్యప్రాణుల మాంసం తినడంతోనే..

గౌరెడ్డిపేట శివారులో అటవీప్రాంతం ఉండడంతో ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని తింటారని సమాచారం. ఈ క్రమంలో ఒడిశా కార్మికులు కుళ్లిన మాంసం తినడంతోనే అస్వస్థతకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు. అయితే అధికారులకు తెలిస్తే ఇబ్బంది అవుతుందనే కారణంతో యాజమాని గుట్టుచప్పుడు కాకుండా దవాఖానకు తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై లేబర్ ఆఫీసర్ స్పందన కోరగా తనకేమీ తెలియదని చెప్పడం గమనార్హం.

కొరవడిన నిఘా..యజమానుల ఇష్టారాజ్యం

గౌరెడ్డిపేట, రాఘవాపూర్, రంగాపూర్ తదితర గ్రామాల్లో 100 వరకు ఇటుక బట్టీలు ఉన్నాయి. సుమారు 200 మంది ఒడిశా కార్మికులు పనిచేస్తున్నారు. అయితే కార్మికులపై అధికారుల నిఘా కొరవడడంతో యాజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించకున్నా అధికారులు కన్నెత్తి చూడడంలేదు. గౌరెడ్డిపేట ఘటన వెలుగుచూడడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓసీపీ-1లో డైరెక్టర్ పర్యటన

మ్యాప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 11: సింగరేణి సంస్థ ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3లో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్ అండ్ పా) ఎన్‌వీకే శ్రీనివాస్ పర్యటించారు. ఆదివారం ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణతో కలిసి ప్రాజెక్టుకు చేరుకున్న డైరెక్టర్ వ్యూ పాయింట్ ద్వారా పని స్థలాలను సందర్శించారు. ప్రాజెక్టులోకి దిగి యంత్రాల పనితీరును పరిశీలించి సూచనలు చేశారు. రక్షణపై అప్రమత్తంగా ఉంటూ ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. వార్షిక ఉత్పత్తికి మరో 48రోజుల గడువు మాత్రమే ఉందని గుర్తు చేశారు. ఇప్పటి నుంచి రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని రక్షణతో కూడిన ఉత్పత్తిని వెలికి తీయాలన్నారు. ఆయన వెంట ప్రాజెక్టు సుంకర మధుసూదన్, ఇంజినీర్ రాజాజీ, సర్వే అధికారి నర్సింగారావు, పర్యావరణ అధికారి సురేష్‌బాబు, ఎస్ఎస్‌వో షరీఫ్ అహ్మద్ ఉన్నారు.

కార్మిక సమస్యలపై సీఐటీయూ వినతి

జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 11: సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఆదివారం జీఎంని కలిసి డివిజన్‌లోని సమస్యలను వివరించారు. ఓసీపీ–3లో సర్వే డిపార్టుమెంట్ ఉద్యోగులకు రెస్ట్ రూం, ఈపీ ఆపరేటర్ల గ్రేడ్ సమస్య, వకీలుపల్లి గనిలో అండర్ గ్రౌండ్‌లో పని చేస్తున్న కార్మికులను సర్ఫేస్‌లో ఉన్న ఖాళీల్లో భర్తీ చేయాలన్నారు. సీహెచ్‌పీలో దుమ్ము నివారించాలని విన్నవించారు. ఏరియా అధ్యక్షుడు కుంట ప్రవీణ్ కుమార్, ఆజ్మీరా కిషోర్, రాంసాగర్, నాగరాజు, రాజేందర్, రాజేశ్‌నాయక్, వినయ్, నర్సింహ, శ్రవణ్ పాల్గొన్నారు.

డాక్టర్ శరణ్యకు అవార్డును ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

శరణ్యకు 'జాతీయ వైద్యరత్న' అవార్డు

రామగిరి, ఫిబ్రవరి 11: వైద్య, సేవా రంగంలో విశిష్ట సేవలందించిన కల్వచర్లకు చెందిన ప్రకృతి వైద్య నిపుణురాలు, లయన్స్ క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శరణ్య యాదవ్‌కు జాతీయ వైద్యరత్న అవార్డు అందజేశారు. తిరుపతిలో జరిగిన బీఎస్ఏ ఏడవ దక్షిణ భారత కాన్ఫరెన్స్‌లో ఆదివారం బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఆయా రాష్ట్రాల అధ్యక్షు లు, తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్ బాదె వెంకటేశం, మిట్టపల్లి సురేందర్ పాల్గొన్నారు.

వలస నాయకులకు అడ్డాగా పెద్దపల్లి పార్లమెంట్

మంథని, ఫిబ్రవరి 11: పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గం వలస నాయకులకు అడ్డగా మారకూడదని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వాసర్ల నతానియేలు అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు పెద్దపల్లి ఎంపీగా పని చేసిన అభ్యర్థులు దాదాపు అందరూ నియోజకవర్గానికి సంబంధం లేని వారే అని వాపోయారు. స్థానికుడిని అయిన తాను పెద్దపల్లి పార్లమెంట్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటున్నానన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పెద్దపల్లి పార్లమెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. విద్యావంతులు, విద్యార్థులు, ఉద్యోగ, కార్మిక, కర్షకులు వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఈర్ల సదానందం, రామగిరి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

దేవి రోహిత్‌కు సత్కారం

కమాన్‌పూర్, ఫిబ్రవరి 11: జూలపల్లిలోని మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో జేసీఐ యువరత్న అవార్డు గ్రహీత దేవిరోహిత్‌ను ఆదివారం పలువురు సత్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామస్వామి, కాంగ్రెస్ నాయకుడు తిరుపతిరెడ్డి, రిటైర్డ్ పోలీసు దేవి లక్ష్మీనర్సయ్య, మాజీ ఎంపీటీసీ దేవి స్రవంతి, దాసరి చైతన్య, రవీందర్, సృజన, దేవి శ్రీనివాస్, లావణ్య, రితిక్, సన్నీ ఉన్నారు.

పూజలు చేస్తున్న అర్చకుడు

కన్యకాపరమేశ్వరి మాతకు పుష్పాభిషేకం

మంథని, ఫిబ్రవరి 11: కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయంలో భక్తులు ఏకాహం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష కాగడ మల్లెలతో అమ్మవారికి పుష్పాభిషేకం, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం భజన, అమ్మవారికి 102 గోత్రములతో అగ్ని గుండ ప్రవేశం, లాలి, జోల, హెచ్చరికల పాటలతో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళా సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు శ్రీనుబాబు

ధ్యానంతో ఆరోగ్యం

మంథని, ఫిబ్రవరి 11: ధ్యానంతో అనారోగ్యం బారిన పడకుండా సంతోషంగా జీవిస్తామని కాంగ్రెస్ నాయకుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. పట్టణంలో మహదేవ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనవుతూ అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. మంథనిలో ధ్యాన మందిరాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీనుబాబును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

ఏటీఎం చోరీ ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

- ఐదు ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 11: గౌతమీనగర్‌లోని ఏటీఎంలో శనివారం తెల్లవారు జాము న జరిగిన చోరీ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. చోరీ చేసిన ముఠా ఆచూకీ కోసం గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక పోలీసు బృందాలతో దర్యాప్తు కొనసాగుతోంది. చోరీకి పాల్పడిన ముఠా సభ్యులను సొత్తుతో సహ పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ముఠా సభ్యులు వాడిన వాహనం, గంగానగర్ ఏటీఎంలో లభ్యమైన ముఠా సభ్యుడి ముఖ చిత్రం సీసీ కెమెరాలో పరిశీలించిన పోలీసులు ఇతర సాంకేతిక పద్ధతుల ద్వా రా నిందితుల వివరాలను సేకరిస్తున్నారు. అంతర్రాష్ట్ర ముఠాగా అనుమానిస్తూ, ఇలాంటి నేరాలకు పాల్పడే గ్యాంగ్‌ల వివరాలను ఆరా తీస్తున్నారు. ఈ మేరకు ఆయా బృందాలు పలు రాష్ట్రాలకు తరలివెళ్లారు. కాగా రెండేండ్ల క్రితం గుంజపడుగులోని బ్యాంక్‌లో జరిగిన చోరీ ఘటనను తలపించేలా గౌతమీనగర్ ఏటీఎం చోరీ ఘటన ఉంది.

రామగుండం కమిషరేట్‌లో 12 మంది ఎస్ఐల బదిలీలు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 11: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 12మంది ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఆదివారం ఐజీ తరుణ్ జోషి బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ లక్ష్మణ్ పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా, పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ వీఆర్ ములుగుకు, సుల్తానాబాద్ ఎస్ఐ–2గా ఉన్న అశోక్‌రెడ్డి పోత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు, పోత్కపల్లి ఎస్ఐ శ్రీధర్ జూలపల్లి పోలీస్‌స్టేషన్‌కు, జూలపల్లి ఎస్ఐ వెంకటకృష్ణ వీఆర్ రామగుండంకు, వీఆర్ ములుగు ఎస్ఐ ఓంకార్ యాదవ్ కాల్వశ్రీరాంపూర్‌కు, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐ శ్రీనివాస్ వీఆర్ రామగుండంకు, తాండూర్ ఎస్ఐ శివనేటి రాజశేఖర్ మందమర్రి ఎస్ఐ–2గా, మంచిర్యాల టౌన్ ఎస్ఐ రాజేందర్ కోటపల్లికి, కోటపల్లి ఎస్ఐ సురేశ్ వీఆర్ రామగుండంకు, కమాన్‌పూర్ ఎస్ఐ రాములు భీమారం పోలీస్‌స్టేషన్‌కు, భీమారం ఎస్ఐ రాజయవర్ధన్ వీఆర్ రామగుండంకు బదిలీ అయ్యారు.

మంత్రి పొన్నం క్షమాపణ చెప్పాలి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11: ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై వ్యంగ్యంగా మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్ల బతుకులు ఆగమవుతున్నాయని వాపోయారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 22 మందికి పైగా ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ కుటుంబాలను కనీసం ఆదుకోకపోగా, వారి ఆత్మహత్యలు ఉత్తవే అంటూ నిండు సభలో మాట్లాడడం మంత్రికి తగదన్నారు. వెంటనే ఆటో డ్రైవర్లకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆటో డ్రైవర్ల ఆగ్రహానికి గురి కావల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

జూలపల్లి, ఫిబ్రవరి 11: జూలపల్లి ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుంటి సది, ఉపాధ్యక్షుడిగా సిలివేరి రాజేశం, ప్రధాన కార్యదర్శిగా కూసి మహేశ్, కోశాధికారిగా నెరువట్ల మహేందర్, సలహాదారుగా మహ్మద్ అజీజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆటో డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రయల్ రన్ సక్సెస్‌తో విజయోత్సవంలో ఎన్టీపీసీ ఈడీ, జీఎంలు, యూనిట్ బృందం

టీఎస్టీపీపీ రెండో యూనిట్ ట్రయల్ రన్ సక్సెస్

- దిగ్విజయంగా ఉత్పత్తిలోకి
- 72 గంటలపాటు నిరంతరాయంగా ఆపరేషన్
- పూర్తయిన ఫేస్-1
- స్వరాష్ట్రానికి సమకూరిన 1600 మెగావాట్లు

జ్యోతినగర్, ఫిబ్రవరి 11: తెలంగాణ దివిటీ.. వెలుగుల దివ్వె ఎన్టీపీసీ ఒడిలో చేపట్టిన టీఎస్టీపీపీ (తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు) ఫేస్–1 పూర్తయింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట ప్రకారం పూర్తిగా తెలంగాణ అవసరాల కోసం కేటాయించిన 4వేల మెగావాట్లలో మొదటి విడతగా 1600 మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టిన రెండు యూనిట్లు (800 x 2) పవర్‌లోకి వచ్చాయి. గతేడాది మొదటి యూనిట్ ఉత్పత్తిలోకి రాగా, ఇప్పుడు రెండో యూనిట్‌ను అధికారులు విద్యుదుత్పత్తిలోకి తెచ్చారు.

72గంటలపాటు ట్రయల్ రన్

టీఎస్టీపీపీ రెండో యూనిట్ నిర్మాణం ఇటీవలే పూర్తయింది. ఉత్పత్తి దశలోకి తెచ్చేందుకు ఎన్టీపీసీ అధికారులు ఈ నెల 1న రాత్రి 8.20 గంటలకు యూనిట్‌ను లైటప్ చేశారు. విద్యుదుత్పత్తిని గ్రిడ్‌కు అనుసంధానించారు. వారం పాటు ఉత్పత్తిలో సాంకేతిక లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడు సరిచేశారు. కాగా, యూనిట్ 2 పూర్తిస్థాయి విద్యుదుత్పత్తిలోకి చేరుకోవడంతో మూడు రోజుల క్రితం ట్రయల్ రన్ ప్రారంభించగా, నిరంతరాయంగా 72 గంటలపాటు సాగింది. ఎక్కడా ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా కొనసాగి ఆదివారం ఉదయం 9గంటలకు ముగిసి, కమర్షియల్ ఆపరేషన్‌కు సిద్ధమైంది. కాగా, ట్రయల్‌రన్ సక్సెస్‌తో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేధార్ రంజన్‌పాండు ప్రాజెక్టులోని సీహెచ్‌పీ, ఎహెచ్‌పీ, డబ్లూటీపీ కంట్రోల్ గదులను సందర్శించారు. యూనిట్ బృంద సభ్యులకు అభినందనలు తెలిపి వారి కృషిని ప్రశంసించారు. ఇక్కడ ప్రాజెక్టు జీఎం జీబీ సురేశ్, వివిధ విభాగాల జీఎంలు సంతోశ్ తివారీ, మోహన్‌రెడ్డి, అలోక్ కుమార్ త్రిపాఠి, రవీంద్రపటేల్, కేసీ సింఘురాయ్, వేముల అనిల్‌కుమార్ ఉన్నారు.

రూ.10,598.98 కోట్లతో నిర్మాణం

టీఎస్టీపీపీని పూర్తిగా తెలంగాణ అవసరాల కోసం సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో పర్యావరణ పరిరక్షణ అనుకూలంగా రూ.10,598.98 కోట్ల వ్యయంతో నిర్మించారు. ప్లాంటు ప్రధాన నిర్మాణ పనులు స్టీమ్ జనరేటర్‌ను బీహెచ్‌ఈఎల్ కంపెనీ చేపట్టగా, టర్బన్ జనరేటర్‌ను ఆల్‌స్టోం(జీఈ) కంపెనీ, బీఓపీ పనులను టాటా కంపెనీ నిర్వహించింది. ప్రాజెక్టుకు కావాల్సిన నీటి కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ వేయగా, సింగరేణి సంస్థ నుంచి బొగ్గు లింకేజీ ఉంది.

సమ్మెకు మద్దతుగా బైక్ ర్యాలీ

గోదావరిఖని/జ్యోతినగర్/రామగిరి, ఫిబ్రవరి 11: కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సమ్మెకు మద్దతుగా ఆదివారం ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ సంఘాలు ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య, అఖిల భారత రైతు కూలీ సం ఘం ఆధ్వర్యంలో గోదావరిఖనిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ మాట్లాడుతూ హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం, రైతులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కాగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుల వెంకన్న, అశోక్ ఆర్జీ–3 ఏరియా సెంటినరీ కాలనీలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చెరువులో పడి పశువుల కాపరి గల్లంతు

ముత్తారం, ఫిబ్రవరి 11: పశువుల కాపరి ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతైన ఘటన మండలంలోని పోతారంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన పశువుల కాపరి చల్ల లింగయ్య (55) ఆదివారం పారుపల్లి శివారులోని యాతల చెరువు వద్దకు పశువులను మేతకు తీసుకెళ్లాడు. కాగా పశువులు నీటిని తాగడం కోసం చెరువులోకి దిగాయి. పశువులు చెరువు లోతులోకి వెళ్తుండగా, వాటిని ఆపేందుకు లింగయ్య నీటిలో దిగి కొంత లోపటికి వెళ్లగా మునిగి గల్లంతయ్యాడు. ఎస్ఐ మధుసూదన్ రావు, మహిళా ఎస్ఐ రాణి ఘటనా స్థలానికి చేరుకొని గజఈత గాళ్లతో వెతికించారు. ఆదివారం రాత్రి వరకు కూడా లింగయ్య ఆచూకీ లభ్యం కాలేదు. జడ్పీటీసీ చెలుకల స్వర్ణలతాఅశోక్, ఎంపీటీసీ బియ్యాని శ్యామలసదానందం, మాజీ సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ ఘటనా స్థలాన్ని పర్యవేక్షించారు. గజ ఈతగాళ్లు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

అనారోగ్యం తాళ లేక..

ధర్మారం, ఫిబ్రవరి11: ధర్మారం మండల కేంద్రానికి చెందిన గోల్కొండ రాజేశ్వరి (37)అనారోగ్యం తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ–2 అశ్విని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజేశ్వరి–రాజేశం దంపతులకు కూతురు సంధ్య, కొడుకు చందు ఉన్నారు. కూతురు వివాహమైంది.కాగా రాజేశం ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. ఇంటిలో రాజేశ్వరి, కొడుకు, ఆమె తల్లి నర్ర వెంకటమ్మ నివాసం ఉంటున్నారు. రాజేశ్వరి కొన్నాళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నది. మందులు వాడినప్పటికి వ్యాధి నయం కాలేదు.దీంతో జీవితంపై విరక్తి చెంది రాజేశ్వరి శనివారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రించిన తర్వాత నివాసం ఉంటున్న రేకుల షెడ్డులో పైపునకు ఉరివేసుకుంది. కొనఊపిరితో రాజేశ్వరి వేలాడుతుండగా గమనించిన కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఆమెను కరీంనగర్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గం మధ్యలో చినపోయినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పథకాలు అందించేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెద్దపల్లి, ఫిబ్రవరి11: ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు మనోజ్ సేథి తెలిపారు. పెద్దపల్లిలోని జ్యోతినగర్‌లో ఆదివాకం నిర్వహించిన వికసిత్ భారత్ యాత్రలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ అభ్యున్నతి సాధించాలన్నారు. ప్రజల వద్దకు పాలన అందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను వివరించి వాటి ఫలాలు అందించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ప్రధాన మంత్రి స్వానిధి, ముద్ర రుణాలు, ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలను సంపూర్ణంగా వినియోగించు కోవాలని సూచించారు. అంతకు ముందు జ్యోతినగర్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్, ఆయుష్మాన్ భారత్ మెడికల్ క్యాంపు, ఉజ్వల్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడి మహిళలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో మధు మోహన్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మేనేజర్ శివప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి11: మండలంలోని మీర్జంపేట లో సమ్మక్క జాతర జరిగే స్థలం వరకు గల రోడ్డుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం మొరం పోయించారు. గ్రామం నుండి మానేరు వాగు ఒడ్డున జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర వరకు గల రోడ్డుకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సహాయంతో మొరం పోయిస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ లు పోశాల సదానందం, మొగిళి సదానందం లు తెలిపారు. ఇక్కడ చైర్మన్లు సుమన్, ఆశోక్, ఉయ్యాల స్వామి, కల్వల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుడి నేత్రదానం

కొయ్యల ఎల్లయ్య(ఫైల్)

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11: గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు కొయ్యల ఎల్లయ్య(85) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయన కుమారుడు మల్లేశ్ తన తండ్రి నేత్రాలను దానం చేశాడు. దీంతో ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ ఎల్లయ్య నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

మంత్రపురి చారిటబుల్ ట్రస్టు సాయం

మంథని రూరల్, ఫిబ్రవరి 11: గోపాలపూర్‌కు చెందిన జ్యోత్స్నా వివాహానికి మంత్రపురి చారిటబుల్ ట్రస్టు సాయం అందించింది. పెళ్లిలో యువతి తరపున సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రాము, భరత్‌రెడ్డి, మధు, లింగయ్య, మొగిలి(కోటయ్య), స్వామి, తిరుపతి పాల్గొన్నారు.